క్లుప్తంగా

చెకుముకి పరీక్షలో రెండో స్థానం



విద్యార్థులను అభినందిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

పాములపాడు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన చెకుముకి పరీక్షలో పాములపాడు ఏపీ మోడల్ స్కూలు రెండో స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ నాగరవీంద్ర ఆదివారం తెలిపారు. త్వరలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చెకుముకి పరీక్షలో తమ విద్యార్థులు వరుణ్ 10వ తరగతి, లింగస్వామి 9వ తరగతి, జయశ్రీ 8వ తరగతి పాల్గొంటారని వివరించారు. విద్యార్థులను, వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ప్రతి పథకం ప్రజల కోసమే



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్, అధికారులు

పాములపాడు: ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం ప్రజల కోసమేనని ఎంపీడీఓ గోపీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని పాములపాడు, మిట్టకందాల గ్రామాల్లో సర్పంచులు మేకల భాగ్యమ్మ, చింతల నారాయణ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు వారి పరిధితో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. గ్యాస్, ఆధార్, మెడికల్ క్యాంపులు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగలక్ష్మి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, పశు వైద్యాధికారి అనిల్, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున పాల్గొన్నారు.

తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు 380 క్యూసెక్కుల నీటి సరఫరా



కేసీ కాల్వలో ప్రవహిస్తున్న సాగునీరు

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు 380 క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ ఆదివారం తెలిపారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం రెండు పంపుల ద్వారా 735 క్యూసెక్కుల సాగునీటిని కేసీ కాల్వకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నీటిని రైతులు వినియోగించుకున్న అనంతరం లాకిన్స్‌లాకు 380 క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. దీనిని తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు సరఫరా చేస్తున్నామని చెప్పారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మద్దతు

ఆత్మకూరు: సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్స్ ఉద్యోగుల నిరవధిక సమ్మెకు సీఐటీయూ మద్దతు తెలుపుతుందని ఆ సంఘం పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్‌నాయక్ తెలిపారు. పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివారం వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ విరమణ 60 ఏళ్లకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఇస్మాయిల్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుంటూరుకు వెళ్లి పింఛన్ అందజేత



గుంటూరులో బాలన్నకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ ప్రశాంతి

వెలుగోడు: గుంతకందాల గ్రామానికి చెందిన కే. బాలన్న, కే.చిన్నమ్మలు ఆరోగ్యం బాగోలేక గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ కే.ప్రశాంతి గుంటూరు వెళ్లి ఆ ఇద్దరికి వైఎస్సార్ పెన్షన్ కానుకను అందించి మానవత్వాన్ని చాటుకుంది. వలంటీర్ ప్రశాంతిని ఈ సందర్భంగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

నందికొట్కూరు: పట్టణంలోని త్రైత సిద్ధాంతం భగవద్గీత గ్రంథంపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని బ్రహ్మంగారి మఠం ఏరియాలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు పర్యటించి రాబోయే ఉత్తరాయణం, భోగి, సంక్రాంతి పండుగల విశిష్టతను వివరించారు. కోరికలు, కర్మలు పూర్తిగా లేకుండా పోతే ఉత్తరాయణం రోజు మోక్షం కలిగి విముక్తి కలుగుతుందని సభ్యులు రామచంద్రుడు, మునిదాసు ప్రజలకు తెలియజేశారు.

ఆత్మకూరులో ప్రగతి పరుగులు

- కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు వేగవంతం
- తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు
- త్వరలో పార్కుల ఏర్పాటుకు శ్రీకారం



ఆత్మకూరు: మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు పరుగు తీస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో దాదాపు 20 వార్డుల్లో పనులు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, మున్సిపల్ అధికారులు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీగా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధి వైపు దూసుకువెళ్తోంది. టీడీపీ ప్రభుత్వంలో నగర పంచాయతీగా ఉన్న ఆత్మకూరును వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీగా మారుస్తూ ప్రభుత్వం జీఓను విడుదల చేస్తుంది. ప్రస్తుతం ఆత్మకూరు మున్సిపాలిటీలో ఉన్న నిధులతో పాటు ఫైనాన్స్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టారు.

పనుల వివరాలు..

2019లో 14వ ఫైనాన్స్ నిధుల కింద కళాంజోరి గ్రాఫిక్ నుంచి ధర్మారెడ్డి ఇంటి వరకు వార్డు 19లో రూ.5 లక్షలతో, అదే ఏడాది గంగమ్మ ఇంటి నుంచి ముర్తుజావలి ఇంటి వరకు రూ.6 లక్షలు, 2021-22లో సుభాని ఇంటి నుంచి కోనేరు పబ్లిక్ స్కూల్ వరకు రూ.21 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం పట్టణంలోని అభివృద్ధి పనుల తీరును పరిశీలిస్తే.. 14వ ఫైనాన్స్ నుంచి 48 పనులకు రూ.3కోట్ల 78 లక్షలు, 14వ ఫైనాన్స్‌లో 60 పనులకు రూ.2 కోట్ల70 లక్షలు, ఎస్‌ఎస్‌సీ కింద మూడు పనులకు సంబంధించి రూ.75 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద 58 పనులకు రూ.కోటి 60 లక్షలు, వైఎస్సార్ అర్బన్ హెల్త్ కేంద్రానికి రూ.80 లక్షలు చొప్పున నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో పట్టణంలోని 24 వార్డుల్లో 20 వార్డుల్లో సీసీరోడ్ల పనులు జోరుగా సాగుతున్నాయి. మొత్తం రూ.9 కోట్ల 63 లక్షలతో పనులు జోరుగా సాగుతున్నాయి.



పట్టణంలో ఊపందుకున్న డ్రైనేజీ పనులు



ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ప్రజానిధుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మంజూరు చేశారు. పట్టణంలోని 13 సచివాలయాలకు రూ.2కోట్ల 60 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో అన్ని సచివాలయాల పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ లాంటి పనులు అభివృద్ధి జరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి తొలి వారంలోనే 21 వ వార్డుతో పాటు పలు వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ ఆధ్వర్యంలో పలు పనులకు భూమి పూజలు చేశారు.





వివిధ కాలనీల్లో జోరుగా ముందుకు సాగుతున్న సీసీరోడ్లు

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళిక

ఆత్మకూరు పట్టణంలో వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య పరిష్కారం కోసం దాదాపు రూ.25 లక్షలతో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశారు. నీటి సమస్య ఏర్పడితే ఆయా కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది నీటి సమస్య తలెత్తకుండా నీటి సరఫరా చేసేందుకు కార్యాచరణ రూపొందించారు.

ఆహ్లాదం కోసం పార్కుల ఏర్పాటు

పట్టణంలో ఆహ్లాద వాతావరణం కోసం పార్కులు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ముందస్తుగా పార్కుల ఏర్పాటు కోసం స్థల అన్వేషణలో మున్సిపల్ అధికారులు ఉన్నారు. ఇప్పటికే ఏ ఏ కాలనీల్లో పార్కులు ఏర్పాటు చేయాలని, ఇందుకు ఎంత నిధులు ఖర్చవుతాయి, తదితర విషయాలపై మున్సిపల్ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. త్వరలో ప్రతిపాదనలు పూర్తి చేసి సంబంధిత అధికారులకు నివేదికలు పంపనున్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



ఆత్మకూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం. పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఎక్కడెక్కడ పార్కులు ఏర్పాటు చేయాలి, ఏఏ కాలనీల్లో వీటిని ఏర్పాటు చేయాలి తదితర అంశాలపై దృష్టి సారించాం. త్వరలో వీటితో పాటు అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాట్లు చేస్తాం. ఆత్మకూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం.

-ఆసియామారూఫ్, మున్సిపల్ చైర్‌పర్సన్, ఆత్మకూరు

వేగంగా అభివృద్ధి పనులు

ఆత్మకూరు మున్సిపాలిటీలో వేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం. పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పట్టణంలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తిచేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం.

- శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్

శాకాహారంతో ఆరోగ్యం

పాములపాడు: శాకా హారం తీసుకోవడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని నందికొట్కూరు పిరమిడ్ సంస్థ మాస్టర్ శివరాజు అన్నారు. ఆదివారం మండలంలోని జూటూరు గ్రామంలో పిరమిడ్ సంస్థ ఆధ్వర్యంలో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సర్పంచు నాయిని సావిత్రమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శాకాహారం యొక్క విశిష్టత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రతి రోజు ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో మాస్టర్లు శ్రీనివాసాచారి, మధులత, సంజయ్‌కుమార్, రామానంద స్వామి, వైఎస్‌ఆర్‌సీపీ మండల కార్యదర్శి మధుసూదన్‌రావు, నాయకులు ఉపేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ సంస్థ సభ్యులు

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడండి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్‌కాలనీలో మంచినీటి సరఫరాలో అంతరాయాలు కలుగకుండా చూడాలని శ్రీశైలం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువనాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సున్నిపెంటలోని ఫిల్టర్‌హౌస్, ప్యూపాయింట్ ప్రాంతాలను పరిశీలించారు. ఇప్పటికే రూ.16.5 కోట్లతో మంచినీటి సరఫరా కోసం నిధులు వెచ్చించామని, మరో రూ.6.6 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఇన్ని కోట్లు ఖర్చు చేస్తున్న నీటి సరఫరాలో సమస్యలు తలెత్తడం బాధాకరంగా ఉందన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నీటి సరఫరాలో అంతరాయాలు కలుగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. అలాగే సొంతంగా నిధులను వెచ్చించి ఫిల్టర్‌హౌస్ వద్ద ఉన్న స్టోరేజ్‌ట్యాంక్‌లను శిల్పా కార్తీక్‌రెడ్డి శుభ్రం చేయిస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, మండల నాయకులు భరత్‌రెడ్డి, విష్ణు, ఏసు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

క్రీడలను ప్రోత్సహించేందుకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి నియోజకవర్గ స్థాయిలో కార్తీక్ ప్రీమియర్‌లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సున్నిపెంటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 27 జట్లకు ఉచితంగా శిల్పా కార్తీక్‌రెడ్డి క్రికెట్‌కిట్లను అందజేశారు. విజేతలకు వరుసగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు బహుమతిగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జింకాగుండయ్య యాదవ్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ రజాక్, మండల నాయకులు భరత్‌రెడ్డి, టీఎమ్‌డీ రఫి, పాపారావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.



స్టోరేజ్ ట్యాంక్ పరిశుభ్రం చేసే పనులను పరిశీలిస్తున్న శిల్పా కార్తీక్

ఆలయ అభివృద్ధికి రాజకీయాలతో ముడి పెట్టొద్దు

- మహానంది ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి

మహానంది: మహానంది ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగానే సుబ్బరాయుడు సెలూన్ దుకాణం తొలగించాల్సి వచ్చిందని, ఇందులో ఎలాంటి రాజకీయ కక్ష సాధింపులు లేవని మహానంది ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి శనివారం మహానంది వచ్చిసి చేసిన రాజకీయ వ్యాఖ్యలను ఖండించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాట్లాడుతూ.. మహానంది అభివృద్ధే లక్ష్యంగా ఒక్క రూపాయి ఆశించకుండా పని చేస్తున్నామన్నారు. క్షేత్రాన్ని సుందరంగా తీర్చిదిద్ది రాష్ట్రంలోనే మోడల్ టెంపుల్‌గా తయారు చేసేందుకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఎంతో కష్టపడుతున్నారన్నారు. తన సొంత డబ్బులు రూ. 2 కోట్లు వెచ్చించి ఆలయ ప్రాంగణంలో సుందరీకరణ పనులు చేపడుతున్న విషయం కనిపించలేదా అంటూ ప్రశ్నించారు. దేవస్థానం ప్రాంగణంలో రూ. 50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు అనుమతులు వచ్చాయని, వర్క్ ఆర్డర్లు కూడా పూర్తయ్యాయని అందులో భాగంగానే సుబ్బరాయుడు దుకాణం తొలగించాల్సి వచ్చింది తెలిపారు. తొలగించిన సుబ్బరాయుడుకు సమీపంలో షాపు కేటాయించడం మీకు తెలియదా అంటూ ప్రశ్నించారు. ఆలయ ప్రాంగణంలో పర్యటిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అసభ్యపదజాలంతో మాట్లాడడం సబబుగా లేదని, మీలాంటి వారు ఆదర్శంగా ఉండేలా మాట్లాడాలి అని హితవు పలికారు. బకాయిల విషయానికొస్తే మీ వెంట తిరిగేవారు సైతం బకాయిలు ఉన్నారని అన్నారు.

శిల్పా పేదల కడుపుకొట్టేవాడుకాదు..

దేవస్థానం అకౌంట్లో రూ.లక్షలు లేని రోజుల నుంచి నేడు రూ. 10.50 కోట్లు డిపాజిట్లు ఉండడం అభివృద్ధికి నిదర్శనం కాదా అని చైర్మన్ ప్రశ్నించారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేదల కడుపు కొట్టేవాడు కాదని, కేవలం పెట్టేవాడని గుర్తు చేశారు. ఆలయ ప్రాంగణంలో వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులు కార్తీక మాసం వరకు అనుమతి అడిగారని, అందుకే అభివృద్ధి పనులను ఆపాల్సి వచ్చిందని తెలిపారు. ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున నిర్వహిస్తున్న అన్నపూర్ణ హోటల్ నిబంధనలకు విరుద్ధంగా ఉందంటూ మండిపడడంపై.. స్పందిస్తూ గతంలో మీ ప్రభుత్వంలోనే షాపుకు అనుమతులు వచ్చాయని గుర్తు చేశారు. ఏజేన్సీ ఉద్యోగులకు వేతనాలు పెరిగాయని, వారిలో మీ పార్టీ వారు ఉన్నారని, కానీ ఎవరినీ తొలగించలేదని తెలిపారు. ట్రస్టు బోర్డు సభ్యులు దాతల సహకారంతో అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించాల్సింది పోయి రాజకీయం పేరుతో అనాలోచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మహానంది మండల వైఎస్సార్‌సీపీ యువనేత ఒంటెద్దు వీరారెడ్డి, మాజీ సర్పంచ్ జయసింహారెడ్డి, నాయకులు మహానంది సాంబిరెడ్డి, భూమా సుబ్బరామయ్య, మనోహర్ రెడ్డి, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి

ప్రార్థనతో కార్మికుల నిరసన

నందికొట్కూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు భాస్కర్ కోరారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ప్రార్థనలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు పరమేష్, నాగేశ్వరరావు, అబ్రహం, నాగన్న, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు రాజు, జోసఫ్, సీఐటీయూ పట్టణ అధ్యక్షులు రజాక్, రామ్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ

జూపాడుబంగ్లా: జై శ్రీరామ్ అంటూ శ్రీరామనామ జపంతో మండలంలోని తాటిపాడు గ్రామంలో ఆదివారం అయోధ్య శ్రీసీతారాముల వారి అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన శ్రీవీరభద్రస్వామి సేవాసమితి సభ్యుల ఆధ్వర్యంలో ముందుగా శ్రీసీతారాముల వారి చిత్రపటాలు, అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, రాములవారి గుడి నిర్మాణ ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి శ్రీరాముల వారి అక్షింతలు, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో శ్రీవీరభద్రస్వామి సేవాసమితి సభ్యులు, హైందవ సంస్కృతి వాదులు, శ్రీరాములవారి భక్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శ్రీశైలం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డికి అయోధ్యరామ తీర్థ ట్రస్ట్ సభ్యులు ఆదివారం అయోధ్య బాలరాముని అక్షితలను, చిత్రపటాలను అందజేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహప్రతిష్ఠ సందర్భంగా ఇళ్లలో ప్రత్యేక పూజలు చేసేందుకు అక్షింతలు అందజేసినట్లు ట్రస్ట్ సభ్యులు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు శ్రీధర్‌గుప్త పాల్గొన్నారు.

దీపోత్సవ పండగ వైభవంగా నిర్వహిద్దాం

మిడుతూరు: జనవరి 22వ తేదీన ప్రతి ఇంటిలో దీపోత్సవ పండగను వైభవంగా నిర్వహిద్దామని భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పాపిరెడ్డి రాజారెడ్డి, సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు రఘురామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలపరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ఆయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ అయోధ్య శ్రీ రామ జన్మభూమిలో నిర్మిస్తున్న నూతన మందిరంలో బాలరాముని నూతన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా దీపోత్సవ పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ ఇంటింటికి అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాపిరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న శ్రీవీరభద్రస్వామి సేవా సమితి సభ్యులు



అక్షింతలను శిల్పా కార్తీక్‌రెడ్డికి అందజేస్తున్న తీర్థట్రస్ట్ సభ్యులు

బాధితురాలికి పరామర్శ

ఆత్మకూరు: పట్టణానికి చెందిన అత్యాచార బాధితురాలిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపకురాలు పట్నం రాజేశ్వరి ఆదివారం పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ పట్టణానికి చెందిన సుల్తాన్, ఓ ముస్లిం బాలికను ప్రేమ పేరుతో నమ్మించి, నల్లమల అటవీ పరిధిలోకి తీసుకువెళ్లి ఆపై అత్యాచారం చేసి, శారీరకంగా, మానసికంగా దాడి చేశాడని చెప్పారు. దీంతో బాలిక తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ప్రేమ పేరుతో బాలికలను మోసగించిన సుల్తాన్‌ను పోలీసులు అరెస్ట్ చేయాలని కోరారు. అనంతరం ఎస్ఐ కృష్ణమూర్తికి బాధితురాలి తరఫున పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షురాలు సునిత, కార్యదర్శి వాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

మహానంది: మహానంది మండలంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ శివ నాగజ్యోతి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. మహానంది మండలంలో 5,320 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. 11 సచివాలయాల పరిధిలో కొత్తగా 56 పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. మొత్తం 5,376 మంది లబ్ధిదారులకు సంబంధిత గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ వలంటీర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు నూతనంగా మంజూరైన వారికి మహానందిలోని శాలివాహన సత్రంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి అందించనున్నట్లు చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కర్నూలు అమీలియో వైద్యులు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. శిబిరాన్ని సర్పంచు నాయిని సావిత్రమ్మ ప్రారంభించారు. మెరుగైన చికిత్సల కోసం కర్నూలు హాస్పిటల్‌కు రెఫర్ చేసినట్లు క్యాంపు ఇన్‌చార్జి నాగేశ్వరరావు, ఆప్తాల్ అసిస్టెంట్ లక్ష్మన్న తెలిపారు. కార్యక్రమలో వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రావు, నాయకులు ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'వికసిత్ భారత్' ఏర్పాట్ల పరిశీలన

పగిడ్యాల: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఏర్పాట్లను కేంద్ర గ్రామీణ అభివృద్ధి డిప్యూటీ సెక్రటరీ లలిత్‌కుమార్ పరిశీలించారు. ఆదివారం స్థానిక మోడల్ స్కూలు ఆవరణలో సోమవారం నిర్వహించే వికసిత్ భారత్ ప్రధానమంత్రి ప్రత్యక్ష ప్రసారం ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. పాఠశాల ఆవరణలో ఎల్ఈడీ స్క్రీన్స్, షామియానాల ఏర్పాటు, స్టాల్స్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, డీటీఓ మంజువాణి, ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు



చిన్నారిని రేగిపండ్లతో ఆశీర్వదిస్తున్న మహిళలు

నందికొట్కూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా వాసవీ కాన్యకా పరమేశ్వరి ఆలయంలో సంక్రాంతి సంబరాలు ఆదివారం వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు ఈపూరు నాగకుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారుల హరిదాసు, రైతులు, అష్టలక్ష్ములుగా వేషధారణ, ముగ్గుల పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఆయా పోటీల్లో గెలపొందిన విజేతలకు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు.



భోగిమంట చుట్టూ నృత్యం చేస్తున్న దృశ్యం

జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం

జూపాడుబంగ్లా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజాసంక్షేమం సాధ్యమవుతుందని పి.లింగాపురం సర్పంచ్, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన గ్రామానికి నూతనంగా మంజూరైన రూ.3వేల పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ లంచం, అవినీతి, అక్రమాలకు తావులేని ప్రజాపాలనను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలకు లంచం ఇస్తేనే పింఛన్ మంజూరయ్యేదన్నారు. జగనన్న సీఎం అయ్యాక పైసా ఖర్చులేకుండా ఎవరి పరపతిలేకుండా ఇంటివద్దకే వచ్చి పింఛన్ అందిస్తున్నారని తెలిపారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ప్రజాపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో మరోమారు సీఎంగా ఆశీర్వదించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.



నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాగార్జునరెడ్డి

క్రికెట్ టోర్నీకి ఏర్పాట్లు ముమ్మరం

వెలుగోడు: వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పా కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి నిర్వహించినున్న కార్తీక్ ప్రీమియర్ లీగ్(కేపీఎల్) టోర్నమెంట్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక డిగ్రీ కాలేజీ క్రీడా మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను సర్పంచ్ వేల్పుల జయపాల్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, నాయకులు తెలుగు రమణ,, బాషా, ఎంపీటీసీ చాంద్ ఆదివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శిల్పా కార్తీక్ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా కార్తీక్ ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహిస్తున్నారని చెప్పారు. వెలుగోడు మండలంలో ఈ పోటీల్లో 36 జట్లు తలపడనున్నాయని తెలిపారు. 36 జట్లకు శిల్పా కార్తీక్ రెడ్డి ఈ నెల 9వ తేదీన ఉచితంగా క్రికెట్ కిట్లు అందజేస్తారని చెప్పారు. ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మండల స్థాయి పోటీలు ఉంటాయని, ఇక్కడ విజయం సాధించిన జట్లు ఆత్మకూరులో నిర్వహించే సెమీ ఫైనల్, ఫైనల్ పోటీల్లో తలబడుతాయని వివరించారు.



మైదానాన్ని చదును చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పీడీఎస్ బియ్యం స్వాధీనం

నందికొట్కూరు: ప్రభుత్వం పేదలకు అందిస్తున్న బియ్యం అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు తప్పవని టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలో ఆటోలో అక్రమంగా 20 బస్తాలు బియ్యం తరలిస్తుంటే దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం బియ్యం అందిస్తుందన్నారు. వ్యాపారులు ప్రభుత్వ బియ్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.